TE TL/26/A2635

వాస్తవాలు పలుకు

# DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:99 | 21-08-2026 శుక్రవారం | పేజీలు: 08 | వెల 3/-



## అంబేద్కర్ ఆశయాలకు అక్షర రూపం.. 'సంఘం శరణం గచ్ఛామి'

- సమాజ మార్పునకు కళే ఆయుధం
- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

4






# 22ఏ కొలిక్కి వచ్చేనా?

- 2025 కొత్త జాబితాపై వెల్లువెత్తిన అభ్యంతరాలు
- 2023 నాటి జాబితాకే పరిమితం చేసే కసరత్తు
- పక్కా ఆధారాలున్న భూములకు ఫాస్ట్‌ట్రాక్ క్లియరెన్స్
- 22ఏ సమస్యపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు
- ప్రభుత్వంపై విపక్షాల ఆరోపణలతో రాజకీయ వేడి

## పాత జాబితాతో భూ వివాదాలకు ముగింపు పలికే యోచనలో సర్కారు

**హైదరాబాద్, ఆగస్టు 20:**

తెలంగాణలో తీవ్ర వివాదానికి కారణమైన 22ఏ నిషేధిత భూముల సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. 2025 డిసెంబర్‌లో రూపొందించిన కొత్త నిషేధిత జాబితాలో ప్రైవేటు భూములు చేరడంతో తలెత్తిన సమస్యలను సరిదిద్దేందుకు పాత జాబితాను ప్రాతిపదికగా తీసుకునే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. మరోవైపు పక్కా ఆధారాలున్న భూములకు తక్షణమే రిజిస్ట్రేషన్లు జరిగేలా ఫాస్ట్‌ట్రాక్ విధానాన్ని అమలు చేస్తోంది. 22ఏ జాబితాలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు ఉన్నతస్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

**కొత్త జాబితాతో మొదలైన చిక్కులు**

ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, సీలింగ్, కోర్టు వివాదాలకు సంబంధించిన భూములను రక్షించేందుకు 22ఏ నిషేధిత జాబితాను రూపొందించారు. అయితే 2025 డిసెంబర్‌లో రూపొందించిన కొత్త జాబితాలో దశాబ్దాలుగా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న భూములు, ఇళ్ల స్థలాలు, అపార్ట్‌మెంట్లు కూడా

మిగతా 2వ పేజీలో..

## ప్రతీ ఫిర్యాదుకు పరిష్కారం తప్పనిసరి

- కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదు పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షణ
- అధికారులకు రెవెన్యూ మంత్రి పొంగులేటి ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 20 :**

ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా 22ఏ అంశంపై రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని,

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణలో 22-ఎ సెక్షన్ దుర్వినియోగం



- రాహుల్ గాంధీకి హరీష్ రావు లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 20:**

తెలంగాణలో 22ఎ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగం జరుగుతోందని బీఆర్ఎస్ నేత, అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు ఆరోపించారు. ఈమేరకు

మిగతా 2వ పేజీలో..

## 22-ఎ పేరిట భూ దోపిడీ

- రాష్ట్రంలో నడుస్తున్నది దోపిడీ పాలన
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్



**హైదరాబాద్, ఆగస్టు 20 :**

ప్రజల ఆస్తులను కాపాడాల్సిన రెవెన్యూ శాఖ బ్రోకర్‌లా వ్యవహరిస్తూ ప్రజల భూములను లూటీ చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్

మిగతా 2వ పేజీలో..

## విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం

- ఏపీ సీఎం చంద్రబాబు
- హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం
- హాజరైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు



**మహాబలిపురం, ఆగస్టు 20:**

హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం మహాబలిపురంలో జరిగింది. ఈ సమావేశంకు ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు హాజరయ్యారు. సమావేశంలో ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని సీఎం సూచించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానించడంతోపాటు దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని స్పష్టం చేసారు.విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునే మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదించిన చేసారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరిన ముఖ్యమంత్రి దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందన్నారు.

మిగతా 2వ పేజీలో..



కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై

## హైకోర్టు ఆగ్రహం

- ఉచిత పథకాలకు చట్టబద్ధ ఆధారం ఏంటని ప్రశ్న
- స్టే ఎత్తివేతకు హైకోర్టు నిరాకరణ
- ప్రభుత్వ జీవోలతో ప్రజాధనం ఖర్చు చేయడంపై ప్రశ్న
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ధర్మాసనం ఆందోళన
- ఆర్టీసీ వంటి సంస్థలను లాభాల్లోకి తేవాలని సూచన
- భూ బాధితులకు పరిహారంపై ప్రభుత్వాన్ని నిలదీత

2

**హైదరాబాద్, ఆగస్టు 21:**

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై దాఖలైన పిటిషన్ల విచారణలో తెలంగాణ హైకోర్టు ప్రభుత్వ తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేయడానికి ధర్మాసనం నిరాకరించింది. 2014 నుంచి అమలవుతున్న ఈ పథకాలకు చట్టబద్ధమైన ఆధారం ఏమిటని ప్రశ్నించిన కోర్టు..

**స్టే ఎత్తివేతకు నిరాకరణ**

పథకాలపై ఉన్న స్టేను తొలగించాలని ప్రభుత్వం తరపు న్యాయవాదులు కోరినప్పటికీ హైకోర్టు అందుకు అంగీకరించలేదు. పథకాల అమలుకు సంబంధించిన చట్టబద్ధత, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై స్పష్టత అవసరమని ధర్మాసనం పేర్కొంది.



2

## 30శాతం కమీషన్ల వసూళ్లపై జవాబివ్వాలి

- మాజీ మంత్రి తలసాని

**హైదరాబాద్,ఆగస్ట్ 20:**

కమీషన్‌ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం 22 ఏ తీసుకొచ్చిందని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల ఇండ్లు, ప్రయివేట్ భూములను 22 ఏ లో చేర్చే అధికారం మీకు ఎవరు ఇచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



## కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

5

- తనిఖీలలో 110 ద్విచక్ర వాహనాలు, 1 ఆటో, 4 కార్లు, స్వాధీనం
- 150 మంది పోలీసు సిబ్బందితో తెల్లవారుజామున విస్తృత తనిఖీలు
- నంబర్ ప్లేట్ లేని, ఫేక్ నంబర్ ప్లేట్ కలిగిన 15 బైక్స్ స్వాధీనం

## కొండా సురేఖకు నోటీసుపై వివరణ

- కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు: మంత్రి
- మల్లు రవికి సురేఖ లేఖ
- కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయాలేనని స్పష్టం
- కుటుంబ బంధాలతో రాజకీయ బాధ్యత మోపడం సరికాదని వెల్లడి
- పార్టీ అధిష్ఠానం, క్రమశిక్షణపై పూర్తి గౌరవం
- నోటీసును వెంటనే ఉపసంహరించాలని విజ్ఞప్తి



2

**హైదరాబాద్, ఆగస్టు 21:**

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసుపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి రాసిన లేఖలో తన వైఖరిని స్పష్టం చేశారు. ఇటీవల తన కుమార్తె కొండా సుష్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, అవి పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని పేర్కొన్నారు.

**కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతం**

కుటుంబ బంధాల కారణంగా ఒకరు చేసిన వ్యాఖ్యలకు మరొకరిని రాజకీయంగా బాధ్యులను చేయడం సరికాదని సురేఖ పేర్కొన్నారు. తన కుమార్తె వ్యక్తం చేసిన అభిప్రాయాలకు

మిగతా 2వ పేజీలో..

# తెలంగాణలో 22-ఎ సెక్షన్ దుర్వినియోగం

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. సెక్షన్ 22ఎ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ ఆపడానికి తెచ్చిన చట్టం అని, ప్రైవేటు ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టించి వసూళ్లకు పాల్పడటానికి కాదని తెలిపారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎండీఏ అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను ఏకపక్షంగా 22ఎజాబితాలో పెడుతూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల రాకెట్ నడుస్తోందని, నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించడానికి దళారులు మార్కెట్ విలువలో ఏకంగా 30% కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను 22A లో పెట్టారని నాలుగు నెలల క్రితమే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా చెప్పినా సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఓఆర్ఆర్ చుట్టుపక్కల భూములపై వివాదాలు సృష్టించి రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్‌కు ఇవ్వాలని యజమానులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఇంత కుంభకోణం జరుగుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. 22ఎపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫోరెన్సిక్ ఆడిట్ ద్వారా ఏ ఆస్తిని ఎవరు జాబితాలో చేర్చారు. ఎందుకు తొలగించారు.. మధ్యవర్తుల ప్రమేయం, ఆర్థిక లావాదేవీలపై తక్షణమే నిజాలు తేల్చాలని కోరారు. బినామీ సంస్థలను నడిపిస్తున్న రాజకీయ శక్తులు ఎవరో విచారణలో నిగ్గు తేల్చాలన్నారు. దశాబ్దాల క్రితమే అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద క్రమబద్ధీకరించిన ఆస్తులను, రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉన్న భూములను మళ్లీ 22ఎలో పెట్టి స్తంభింపజేయడం దుర్మార్గమన్నారు. జిల్లాల వారీగా 22ఎ జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలన్నారు. ఏ భూమిని ఎప్పుడు చేర్చారు, ఎవరి ఆదేశంతో తీసేశారో ప్రజలకు పారదర్శకంగా తెలియాలని, ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పిన భూమాత.. భూ రికార్డులకు స్పష్టతనివ్వాలి అన్నారు. ఒక అవినీతి మంత్రిని కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పణంగా పెడుతోందని విమర్శించారు. ఈ దోపిడీపై రాహుల్ గాంధీ వెంటనే జోక్యం చేసుకోకపోతే కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ ఆరోపణలపై స్వతంత్ర విచారణకు ఆదేశించి రేవంత్ ప్రభుత్వం తన నిజాయతీని నిరూపించుకోవాలని, లేదంటే బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆరఎస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# 30శాతం కమీషన్ల వసూళ్లపై జవాబివ్వాలి

22 ఏను అడ్డం పెట్టుకొని భూముల యజమానులను భయపెట్టి 30 నుండి శాతం కమీషన్లను వసూలు చేసిన మాట వాస్తవం కాదా అని నిలదీశారు.

వెస్ట్ మారేడ్ పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం తప్పిదాలు చేసి అధికారులపై నెపం పెట్టి తప్పించుకోవాలని చూస్తున్నదని విమర్శించారు. కరోనా సమయంలో సరిపడా ఆక్సిజన్, బెడ్ లు లేక ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్ అవసరాల కోసం ముందు చూపుతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట ప్రాంతాలలో కార్పొరేట్ స్థాయి హాస్పిటల్స్ నిర్మాణ పనులు చేపట్టిందని వివరించారు. తమ ప్రభుత్వ హయాంలోనే 60 శాతం పనులు పూర్తయ్యాయనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. సనత్ నగర్ టిమ్స్‌ను కట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకోవడం అవివేకమని విమర్శించారు. హాస్పిటల్ లో అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించకుండా హడావుడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. హాస్పిటల్ ప్రారంభోత్సవ సభలో అధికారిక కార్యక్రమం అనే సోయి లేకుండా వైద్యులు, నర్సింగ్ విద్యార్థుల ముందు ముఖ్యమంత్రి నోటికొచ్చినట్లు అబద్ధాలు మాట్లాడారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి తన భాషను మార్చుకోవాలని, నోటిని అదుపులో పెట్టుకోవాలని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. ప్రజాపాలన అని ఒక వైపు ప్రచారం చేసుకుంటూ మరో వైపు నిర్బంధాలు, అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# కొండా సురేఖకు నోటీసుపై వివరణ



తనను బాధ్యురాలిని చేయడం న్యాయసూత్రాలకు విరుద్ధమని లేఖలో వివరించారు.

**పార్టీపై పూర్తి గౌరవం**

కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, అధిష్ఠానం నిర్ణయాలు, పార్టీ క్రమశిక్షణ నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని మంత్రి స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాలను, క్రమశిక్షణను తాను ఎప్పుడూ గౌరవిస్తానని పేర్కొన్నారు.

**తన ప్రమేయం లేదని వెల్లడి**

వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారంలో తనకు ఎలాంటి ప్రమేయం లేదని సురేఖ తెలిపారు. ఈ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. తన ప్రమేయం లేని అంశంలో తనకు నోటీసు జారీ చేయడం సరికాదని పేర్కొన్నారు.

**నోటీసు ఉపసంహరణకు విజ్ఞప్తి**

కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం తగదని పేర్కొంటూ జారీ చేసిన నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణ కమిటీని మంత్రి కొండా సురేఖ కోరారు. తన వివరణను పరిగణనలోకి తీసుకుని ఈ అంశాన్ని ముగించాలని విజ్ఞప్తి చేశారు.

## విశ్వాసం, పరస్పర సహకారంతో
# సమస్యల పరిష్కారం

2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు. వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ప్రసంగంలో పేర్కొన్న సీఎం, విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థలు 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదనీ వెల్లడించారు. కావేరి నదుల అనుసంధానంతో 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదన చేసిన సీఎం, గోదావరి, కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వ్యాఖ్యానించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. గంగా, కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరం అన్న చంద్రబాబు, నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలన్నారు. చంద్రబాబు ప్రసంగాన్ని కొనియాడిన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్ తో మాట్లాడారన్నారు. విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధి గురించి మాట్లాడారని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రశంసించారు.

# 22ఏ కొలిక్కి వచ్చేనా?

మొదటిపేజీ తరువాయి

చేరడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో రైతులు, భూ యజమానులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



**పాత జాబితాతో పరిష్కారం?**

కొత్త జాబితాపై పెద్దఎత్తున అభ్యంతరాలు రావడంతో 2023 డిసెంబర్ నాటి పాత జాబితాను ప్రాతిపదికగా తీసుకుని లావాదేవీలు నిర్వహించే అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పాత రికార్డుల ఆధారంగా ముందుకు వెళ్తే ప్రస్తుతం ఏర్పడిన అనేక వివాదాలను త్వరగా పరిష్కరించవచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే దీనిపై తుది నిర్ణయం ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

**తప్పులను సరిచేస్తాం: పొంగులేటి**

22ఏ జాబితాలో ప్రైవేటు ఆస్తులు చేరిన విషయం వాస్తవమేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే అంగీకరించారు. ప్రభుత్వ జీవోలు, మెమోల ద్వారా గతంలో హక్కులు పొందిన భూములకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో లేకపోవడంతో సమస్య తలెత్తిందని వివరించారు. ప్రభుత్వ భూములు కానివాటిని 22ఏ నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఇందుకోసం రెవెన్యూ, స్టాంపులురిజిస్ట్రేషన్ల శాఖల ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, 15 రోజులపాటు సమస్యలను పరిష్కరించే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

**కొన్ని ప్రాంతాల్లో ఊరట**

ప్రభుత్వ ఆదేశాలతో పలు ప్రాంతాల్లో ఇప్పటికే నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించే ప్రక్రియ మొదలైంది. బాలానగర్ పరిధిలోని పలు సర్వే నంబర్ల భూములకు 22ఏ నిషేధం తొలగించినట్లు అధికారులు ప్రకటించారు. పోచారం గ్రామంలోని ఓ భూమిని పొరపాటున నిషేధిత జాబితాలో చేర్చినట్లు గుర్తించి క్లియరెన్స్ ఇచ్చారు. కూకట్‌పల్లి అడ్డగుట్ట సొసైటీలోని సుమారు 300 ప్లాట్లకు కూడా నిషేధం తొలగించినట్లు సమాచారం.

**రాజకీయంగా మరింత వేడెక్కిన వివాదం**

22ఏ వ్యవహారంపై విపక్షాలు ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేఖ రాస్తూ, ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించేందుకు కమీషన్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా చేశారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం ఖండిస్తూ, జరిగిన తప్పులను సరిదిద్దుతున్నామని చెబుతోంది.

22ఏ జాబితాలో నిజమైన ప్రభుత్వ భూములు, నిషేధిత కేటగిరీల భూములను కొనసాగిస్తూ, పొరపాటున చేర్చిన ప్రైవేటు ఆస్తులను తొలగించడమే ప్రభుత్వ ముందున్న ప్రధాన సవాలుగా మారింది. ప్రభుత్వం చేపడుతున్న సమీక్ష, ఉన్నతస్థాయి కమిటీ చర్యలు ఎంత వేగంగా సమస్యను పరిష్కరిస్తాయన్నదే ఇప్పుడు కీలకంగా మారింది.

# ప్రతీ ఫిర్యాదుకు పరిష్కారం తప్పనిసరి

మొదటిపేజీ తరువాయి

కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును ఫిర్యాదుగా కాక ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై అధికారులతో బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాల గురించి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా.. భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది.. దరఖాస్తుదారుడికి అర్హత ఉందా అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీమళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతోపాటు, గత రెండు మూడు రోజుల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులు పెండింగ్ పడకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 22ఏ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 'రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి.. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి.. చివరి వరకు పర్యవేక్షించండి.. మీ పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి' అని అధికారులకు సూచించారు.

**రేపటినుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలు**

క్షేత్రస్థాయిలో సమస్యలకు పరిష్కారం చూపే దిశగా కార్యాచరణ

ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయడం, భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల వారీగా సమీక్షలకు శ్రీకారం చుడుతున్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సమీక్షలు కేవలం అధికారిక సమావేశాలకే పరిమితంకాక క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలను నిర్దేశించే విధంగా కొనసాగనున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల సమీక్షలను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించడంతోపాటు, దూర ప్రాంత జిల్లాలకు మంత్రి స్వయంగా వెళ్లి అక్కడే సమీక్షలు నిర్వహించనున్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్లు సహా సంబంధిత శాఖల అధికారులందరూ ఈ సమీక్షల్లో పాల్గొంటారు. ఆయా ప్రాంతాలకు సంబంధించిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా సమీక్షల్లో భాగస్వాములను చేసి ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, స్థానిక అవసరాలు, పరిష్కరించాల్సిన అంశాలను నేరుగా తెలుసుకునే విధంగా ఈ సమీక్షలను నిర్వహించనున్నారు.

**హౌసింగ్ అమలుపైనా సమీక్ష**

రెవెన్యూ అంశాలతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, హౌసింగ్ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, స్థలాల సమస్యలు తదితర అంశాలను కూడా జిల్లా సమీక్షల్లో మంత్రి పరిశీలించనున్నారు. జిల్లాల వారీగా చేపట్టనున్న సమీక్షల్లో భాగంగా శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షను జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్ష జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు.

# 22-ఎ పేరిట భూ దోపిడీ

మొదటిపేజీ తరువాయి

ఓ ప్రకటనలో ఆరోపించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లే 22ఎ నిషేధిత జాబితాలోకి ఎక్కిందంటే ఇక రాష్ట్రంలో సామాన్యుడి ఆస్తికి ఏం భద్రత ఉంటుందని ప్రశ్నించారు. పరిస్థితి చేతులు దాటడంతోనే సీఎం స్పందించాల్సి వచ్చిందన్నారు. మంత్రి పొంగులేటి క్షమాపణలు చెప్పారంటేనే ఘోరమైన స్కాం జరిగిందని ప్రభుత్వం స్వయంగా ఒప్పుకున్నట్లేనని, తప్పు చేయనప్పుడు క్షమాపణలు ఎందుకు చెబుతున్నారని నిలదీశారు. రాత్రికి రాత్రే ప్రైవేట్ భూములను 22ఎలోకి మార్చడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కేబినెట్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బాహాటంగా ఒప్పుకుంటున్నారంటే కాంగ్రెస్ సర్కారు లోపల జరుగుతున్న స్కామ్‌ను వాళ్లే బయట పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామన్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు సామాన్యుడి ఆస్తులనే బంగాళాఖాతంలో ముంచేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో 22 లక్షల ఎకరాలు వివాదాల్లో ఉన్నాయని నాడు మొసలి కన్నీరు కార్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలోనే ఏకంగా లక్షల ఎకరాల ప్రైవేటు భూములను 22ఎ చిక్కుల్లోకి నెట్టారన్నారు. ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాల్సి వస్తుందేమోనని హైకోర్టు సైతం మొట్టికాయలు వేసే దుస్థితికి ఈ ప్రభుత్వం దిగజారిందన్నారు. పైసాపైసా కూడబెట్టుకుని కొనుక్కున్న స్థలాలను కాంగ్రెస్ పెద్దల కన్ను పడితే చాలు వివాదాల్లోకి నెట్టి కబ్జా చేయడమే లక్ష్యంగా మారిందని, హైదరాబాద్ చుట్టుపక్కల విలువైన స్థలం కనిపిస్తే చాలు.. రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి ఎక్కించి ఆ తర్వాత సెటిల్‌మెంట్లకు తెరలేపుతున్నారని ఆయన ఆరోపించారు. ఆ లిస్టు నుంచి పేరు తీయాలంటే 30% నుండి 40% కమీషన్లు లేదా వాటాలు డిమాండ్ చేస్తూ ప్రజలను, బిల్డర్లను బెదిరిస్తున్నారన్నారు. బడాబాబుల జోలికి వెళ్లకుండా చిన్న ఉద్యోగులు, పేదలు కొనుక్కున్న 60, 100 గజాల ప్లాట్లను 22ఎలో పెట్టి వారి కడుపు కొడుతున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెరా అనుమతులు ఉండి, బ్యాంకులు రుణాలు ఇచ్చి, రిజిస్ట్రేషన్ పూర్తయిన ఆస్తులను అకస్మాత్తుగా నిషేధిత జాబితాలో ఎలా పెడతారని లక్ష్మణ్ ప్రశ్నించారు. జూలైలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం దారుణంగా పడిపోయినా సర్కారుకు చీమ కుట్టినట్లయినా లేదని, ప్రభుత్వ ఖజానా కంటే నేతల జేబులు నిండటమే వీరికి ముఖ్యమని వ్యాఖ్యానించారు. పెద్దల భూములను రాత్రికి రాత్రే 22ఎ లిస్టు నుంచి తొలగిస్తూ సామాన్యుడిని నెలలతరబడి ఎందుకు తిప్పుకుంటున్నారని లక్ష్మణ్ నిలదీశారు. నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా సామాన్యుల దరఖాస్తులు పరిష్కరించడానికి స్పష్టమైన కాలపరిమితితో కూడిన విధానాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అమలు చేయడం లేదన్నారు. విలువైన ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ భూములకు సర్వే నంబర్లు మార్చి బై నంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ అనుయాయులకు పంచుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చాక 22ఎ జాబితా నుంచి ఎన్ని వేల ఎకరాలు తొలగించారు.. అందులో బడా కంపెనీలు, మంత్రుల బినామీలు ఎవరున్నారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాం బయట పడగానే అంతా అధికారుల తప్పిదమేనని చేతులు దులుపుకోవాలని చూస్తున్నారన్నారు. మంత్రుల ఆదేశాలు లేకుండానే అధికారులు ఇంత పెద్ద ఎత్తున చేస్తారా.. దొరికిపోగానే పదేళ్లుగా ఉన్న పాత అధికారుల కుట్ర అని చెప్పడం హాస్యాస్పదమని ఆయన అన్నారు. ఆ అధికారులకు కీలక పోస్టింగులు ఇచ్చింది మీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ప్రజలు దరఖాస్తులు చేసుకోనవసరం లేదని మంత్రులు మీడియా ముందు చెబుతూ క్షేత్రస్థాయిలో మాత్రం సామాన్యుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసి ఆగం చేస్తున్నారన్నారు. అపార్ట్‌మెంట్ ఫ్లాట్లను కూడా నిషేధిత జాబితాలో చేర్చి విక్రయాలు జరగకుండా అడ్డుకుంటున్నారన్నారు.



## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై
# హైకోర్టు ఆగ్రహం

**ఆర్థిక పరిస్థితిపై ఆందోళన**

రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర కీలక విభాగాలు నిధుల కొరత ఎదుర్కొంటున్న సమయంలో ఉచిత పథకాలకు ప్రజాధనం ఖర్చు చేయడంపై కోర్టు ప్రశ్నలు సంధించింది. రిటైర్డ్ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు సకాలంలో అందక ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితులను ప్రస్తావిస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు 'డేంజర్ బెల్స్' మోగిస్తున్నాయని వ్యాఖ్యానించింది.

**సంస్థలను లాభాల్లోకి తేవాలని సూచన**

ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును నేరుగా ఉచిత పథకాలకు వెచ్చించే బదులు ఆర్టీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ముందుగా లాభాల్లోకి తీసుకురావాలని ధర్మాసనం సూచించింది. ఆయా సంస్థల ద్వారా వచ్చే ఆదాయంతో సంక్షేమ కార్యక్రమాలకు నిధులు సమకూర్చవచ్చని అభిప్రాయపడింది.

**భూ బాధితులపై అసహనం**

భూసేకరణలో భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పరిహారం కోసం బాధితులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని పేర్కొంది. ఈ వ్యవహారంలో తప్పుడు అఫిడవిట్ సమర్పించడంపైనా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది.

**స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆదేశం**

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చట్టబద్ధత, వాటికి కేటాయిస్తున్న బడ్జెట్, నిధుల వినియోగంపై ప్రభుత్వం పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. కేసు తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

## వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం



**భద్రాచలం , ఆగస్టు 18 (డిడి9 వార్త)**

భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం గురువారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని శ్రీరామ సేవా మండపంలో నిర్వహించిన ఈ కల్యాణ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణంలో అత్యంత కీలకమైన జీలకర్ర–బెల్లం, మాంగల్యధారణ కార్యక్రమాలు భక్తుల హర్షధ్వానాల మధ్య జరిగాయి. కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**భద్రాచలం, ఆగస్టు 20 (డిడి9 వార్త)**



ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) భద్రాచలంలో 2026–27 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. జాన్ మిల్టన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ విద్యార్హతతో పాటు పీహెచ్‌డీ, నీట్, స్లాట్, సెట్‌తో పాటు బోధనా అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. కామర్స్ ఒకటి, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్‌లో ఒక పోస్టు భర్తీ చేయనున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో శనివారం సాయంత్రం 4 గంటల్లోపు దరఖాస్తులు సమర్పించి సోమవారం ఉదయం 10 గంటలకు కొత్తగూడెంలోని శ్రీ రామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో తప్పనిసరిగా హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

## ఆరుతడి పంటల సాగుపై అవగాహన..



**ఆగష్టు 20 డిడి9 వార్త వెంకటాపురం.**

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి నవీన్ సూచించారు. వెంకటాపురం మండలం పాత్రాపురం రైతు వేదికలో గురువారం పంటల వైవిధ్యీకరణ–ఆరుతడి పంటల సాగు అంశంపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు అధిక నీటి అవసరమయ్యే సంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్న సాగుకు ప్రత్యామ్నాయంగా పెసర, మినుము, అలసందలు, కూరగాయలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. కాగా తక్కువ నీటితోనే ఈ పంటలను సాగు చేసుకోవచ్చని, వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు కొంత మేరకు నష్టాన్ని తగ్గించేందుకు ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే ప్రభుత్వం సూచించిన ఏడు సన్నవరి రకాలను సాగు చేసిన రైతులు రూ.500 బోనస్ పొందేందుకు డీలర్ల వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని నవీన్ సూచించారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులకు ప్రభుత్వం అందించే బోనస్ లభించదని స్పష్టం చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో మండలంలోని రైతులు, ఏఈఓలు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు



**భద్రాచలం , ఆగస్టు 20 (డిడి9 వార్త)**

మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం భద్రాచలంలోని కూనవరం రోడ్డులోని రాజీవ్ విగ్రహానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ఆధునిక నిర్మాణం, సాంకేతిక అభివృద్ధి, యువతకు అవకాశాలు, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురువు ప్రాణానికే రక్షణ కరువైందా!!!

- **నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యపై ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కంది రవీందర్‌రెడ్డి ఆవేదన**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 20 (డీడీ9 వార్త):**



"గురు బ్రహ్మ.. గురు విష్ణుః.. గురు దేవో మహేశ్వరః.." అంటూ గురువును త్రిమూర్తులతో సమానంగా గౌరవించిన దేశంలో.. నేడు గురువు ప్రాణానికే రక్షణ లేకపోతే మన విద్యావ్యవస్థ ఎటువైపు వెళ్తోంది? అనే ప్రశ్న ప్రతి ఒక్కరి మనసును కలచివేస్తోందని 1 ట్రస్మా పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కంది రవీందర్‌రెడ్డి అన్నారు.

నల్గొండ జిల్లాలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య ఘటన అత్యంత విషాదకరమని, ఈ సంఘటనను కేవలం ఒక హత్యగా కాకుండా విద్యార్థులు– తల్లిదండ్రులు– ఉపాధ్యాయులు– సమాజం మొత్తం ఆలోచించాల్సిన హెచ్చరికగా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

తప్పు చేసినప్పుడు పిల్లలను ఎవరు ఆపాలి!

పిల్లలు ఏం చేసినా సరే.. మన పిల్లలే కదా అంటూ తప్పులను సమర్థించడం ఎంతవరకు సమంజసం!

తప్పు చేస్తున్నప్పుడు మందలించే హక్కు తల్లిదండ్రులకు లేదా?

విద్యార్థి భవిష్యత్తు కోసం క్రమశిక్షణ నేర్పే ఉపాధ్యాయుడి మాటకు విలువ లేదా!

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

నేటి సమాజంలో కొంతమంది విద్యార్థుల్లో కోపం, చిరాకు, సహనం లేకపోవడం, బాధ్యతారాహిత్యం, గురువుల పట్ల గౌరవం తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఇవి చిన్న విషయాలుగా తీసుకుంటే భవిష్యత్తులో మరింత ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం ఉందన్నారు.

గురువు మందలిస్తే శత్రువా!

విద్యార్థి తప్పు చేస్తే మందలించే గురువు.. అతని భవిష్యత్తును నాశనం చేయాలని కాదు, అతని జీవితాన్ని సరైన దారిలో పెట్టాలని ప్రయత్నిస్తాడని అన్నారు.

ఈ రోజు గురువు మందలించినందుకు కోపం రావచ్చు.. కానీ అదే మాట రేపు జీవితంలో విజయం సాధించడానికి మార్గదర్శకం కావచ్చు. గురువు చెప్పే ఒక్క మాటను శత్రుత్వంగా చూడటం మొదలైతే విద్యార్థి భవిష్యత్తుకు నష్టం కలుగుతుంది" అని అన్నారు.

తల్లిదండ్రులు ఒక్కసారి ఆలోచించాలి

పిల్లలను ప్రేమించడం తప్పు కాదు.. కానీ తప్పును కూడా ప్రేమ పేరుతో సమర్థించడం మాత్రం ప్రమాదకరం అని కంది రవీందర్‌రెడ్డి అన్నారు.

పిల్లలు ఏ తప్పు చేసినా వెనకేసుకొచ్చే తల్లిదండ్రులు, పాఠశాలలో క్రమశిక్షణ విషయంలో ఉపాధ్యాయులను ప్రశ్నించే ముందు.. తమ పిల్లల ప్రవర్తనను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు.

"నేడు రూపారెడ్డి.. రేపు ఎవరు!"

ఒక గురువు హత్యకు గురైన తర్వాత స్పందించడం మాత్రమే కాదు.. ఇలాంటి ఘటన మరోసారి జరగకుండా వ్యవస్థను మార్చడం ముఖ్యం అన్నారు.

నేడు రూపారెడ్డి.. రేపు మరొక ఉపాధ్యాయుడు.. ఈ ప్రశ్నకు సమాధానం ఎవరు చెబుతారు! అని ఆయన ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యావేత్తలు, మేధావులు, ప్రభుత్వం, చట్టసభలు, న్యాయవ్యవస్థ—అందరూ కలిసి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

రైతు ఏడిస్తే దేశానికి అరిష్టం అంటారు.. మరి గురువే ఏడిస్తే!

గురువు కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి కాదు.. ఒక తరాన్ని తీర్చిదిద్దే శిల్పి. అలాంటి గురువు భయంతో బోధించే పరిస్థితి వస్తే, దాని ప్రభావం ఒక్క పాఠశాలపై కాదు.. మొత్తం సమాజంపై పడుతుందని అన్నారు.రైతు ఏడిస్తే దేశానికి అరిష్టం అంటారు.. మరి గురువే ఏడిస్తే..మన సమాజ భవిష్యత్తు ఎటువైపు!" అని కంది రవీందర్‌రెడ్డి ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి హృదయవిదారక ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి తల్లిదండ్రి, ప్రతి విద్యార్థి, ప్రతి ఉపాధ్యాయుడు ఒక్కసారి ఆలోచించాల్సిన సమయం ఇదే అని ఆయన పిలుపునిచ్చారు. రూపారెడ్డి హత్యకు నిరసనగా పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్ పాటించనున్నట్లు ఆయన తెలిపారు.

## బాలికల విద్యకు ఎన్‌టీపీసీ చేయూత

- **171 మంది విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ**
- **రామగుండం మండలంలోని 8 పాఠశాలలకు చెందిన 9వ తరగతి బాలికలకు పంపిణీ**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 20 (డీడీ9 వార్త):**



ఎన్‌టీపీసీ రామగుండం సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా రామగుండం మండలంలోని ఎనిమిది పాఠశాలలకు చెందిన 9వ తరగతి బాలికలకు 171 సైకిళ్లను పంపిణీ చేశారు. గురువారం గోదావరిఖని అశోక్‌నగర్‌లోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, పాఠశాలల ఉపాధ్యాయులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. బాలికలు పాఠశాలలకు సులభంగా, సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు సైకిళ్ల పంపిణీ చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. పాఠశాలకు ప్రతిరోజూ హాజరయ్యేలా ప్రోత్సహించడంతో పాటు, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులు ఎదుర్కొనే రవాణా ఇబ్బందులను తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. బాలికల విద్యను ప్రోత్సహించడంతో పాటు, వారి భద్రత, క్రమం తప్పని పాఠశాల హాజరుకు ఈ సీఎస్ఆర్ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## సెప్టెంబర్ 9న చలో వరంగల్‌కు తరలిరావాలి..

**ఆగస్టు20 డిడి9 వార్త వెంకటాపురం.**




సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్–ఎంఎస్పీ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా ఇంచార్జి చాతాళ్ల రమేష్ మాదిగ పిలుపునిచ్చారు.వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఎమ్మార్పీఎస్–ఎంఎస్పీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాతాళ్ల రమేష్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఫలాలు అర్హులకు అందేలా, మాదిగల హక్కులు–ఆత్మగౌరవం కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 33 ఏళ్లుగా సాగుతున్న ఉద్యమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు.సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా యాసం రమేష్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా వేల్పుల వెంకటేష్ మాదిగ సహా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఉద్యమాన్ని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గుగ్గిళ్ల నరేందర్ మాదిగ, వ్యాసం మహేష్ మాదిగ, చెన్నం ఆనంద్ మాదిగ, కోగిల ప్రవీణ్ మాదిగ, కోగిల సాయిచంద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నరామన్ చర్లలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**జనగామ ఆగష్టు 20(డిడి 9 వార్త)బ్యూరో**

బచ్చన్నపేట మండల పరిధిలోని చిన్నరామన్ చర్ల గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మహమ్మద్ అజాం, రేషన్ డీలర్ మంగలపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. స్మార్ట్ రేషన్ కార్డులతో రేషన్ సరుకుల పంపిణీలో మరింత పారదర్శకత ఉంటుందని తెలిపారు. కార్డులు అందని అర్హులైన లబ్ధిదారులు రేషన్ డీలర్‌ను సంప్రదించాలని సూచించారు.

కార్యక్రమంలో వీఆర్వో పండుగ యాకన్నా,మాజీ సర్పంచ్ పిన్నింటి బాపురెడ్డి, గుడికందుల యాదగిరి, కల్లం రమేష్, బేజగాం నరేష్, నిమ్మ కృష్ణ, బాబు గౌడ్, యావళ్ల అంజనకుమార్, జన్నె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డికి ప్రగతి పాఠశాల ఉపాధ్యాయుల నివాళి




- **ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించిన సిబ్బంది**
- **కరస్పాండెంట్ సురకంటి వనమాల ఆధ్వర్యంలో సంతాపం**

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో :ఇచ్చోడ న్యూస్ :(డిడి9 వార్త న్యూస్ )**

ప్రిన్సిపాల్ రూపారెడ్డి మృతి పట్ల ప్రగతి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ పాఠశాల ఆవరణలో మౌనం పాటించినివాళులర్పించారుఈ సందర్భంగా రూపారెడ్డి విద్యారంగానికి అందించిన సేవలనుగుర్తుచేసుకున్నారు. ఆమె మృతి విద్యారంగానికి తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కార్యక్రమంలో ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ సురకంటి వనమాల, ప్రిన్సిపాల్ మంజుల, నిజామోద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీ అల్లం సాయికిరణ్ రెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి

- సామాజిక కార్యకర్త పూనెం ప్రదీప్ కుమార్
- భద్రాచలంలో ప్రభుత్వ భూముల కబ్జాలపై సామాజిక కార్యకర్త ప్రదీప్ కుమార్ నిరసన దీక్ష

**భద్రాచల, ఆగస్టు 20 (డిడి9 వార్త)**

భద్రాచలం పట్టణంలో ప్రభుత్వ భూములు, ఫుట్ పాత్ లు, డ్రైనేజీలు, చెరువుల ఆక్రమణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త పూనెం ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు. భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్ లో గురువారం ఆయన ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు నడిచేందుకు ఏర్పాటు చేసిన ఫుట్ పాత్ లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. డ్రైనేజీలను సైతం ఆక్రమించి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారని, శాంతినగర్ లో సుమారు రెండు ఎకరాల చెరువు భూమిని పూడ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణలపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని నిరుపేదలకు కేటాయించాలని అన్నారు. అలాగే



మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పౌల్‌రాజ్, గోండ్వానా సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు సోందె వీరయ్యలు మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలను కాపాడాలని కోరారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు విఫలమైతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని సామాజిక ఉద్యమకారుడు అలవాల రాజా హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఆక్రమణలను తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

# కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూములను రక్షించాలని వినతి

**చర్ల, ఆగస్టు 20 (డిడి 9 వార్త)**





చర్ల మండల కేంద్రంలోని గ్రామ కంఠం లోని ప్రభుత్వ భూముల కబ్జా దారుల పై రెవిన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు కొరడ జులుపించాలని మండల తహసీల్దార్, గ్రామ పంచాయతీ సర్పంచ్ లకు తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ బృందం గురువారం వినతి పత్రం అందచేసారు. చర్ల మండల కేంద్రంలో గల సర్వే నెంబర్ 117 విస్తీర్ణంలోని 378 ఎకరాల భూమి అన్యాక్రాంతం అవుతుందని, విలువ గల చర్ల గ్రామ కంఠ ప్రభుత్వ భూములు వలస గిరిజనేతరుల కబ్జాలో ఉన్నాయని, అట్టి భూముల పై తహసీల్దార్, గ్రామ పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేయాలనీ, పూర్తి ఏజెన్సీలో ఎల్ టిఆర్, 1/70,1996 పెసా చట్టాలు ఉన్నపటికీ అమలు జరిపే విషయంలో అధికారులు విఫలం అవుతున్నారని ఆదివాసీ పోరాట వీరులు సాధించిన హక్కులు చట్టాల ప్రతి ఫలాలు 80 ఏళ్ల స్వాతంత్ర్య భారతావనిలో అందని ద్రాక్షల మిగిలి పోతున్నాయని, భవిష్యత్తు లో ఆదివాసీ పోరాటాలు ఉధృతం చేస్తామని తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ తెలియజేసింది. ఈ కార్యక్రమం లో తుడుందెబ్బ పొలిట్ బ్యూరో సభ్యులు వాసం ముసలయ్య, విద్యార్థి జేఏసీ రాష్ట్ర నాయకులు ఇర్ప ప్రకాష్ దొర తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ తుడుందెబ్బ మండల కమిటీ సభ్యులు యాక సురేంద్ర, మడప అనిల్, సరెం హరిదీప్, సోడి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# జేఏసీ పోరాటాలను విజయవంతం చేయండి

## నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన

**బోనకల్,ఆగస్టు20,డీడీ9 వార్త:**

ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యల పరిష్కారానికై యుఎస్పిసి బోనకల్ మండల కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై జేఏసీ ఇచ్చిన పోరాట కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 27వ తేదీన ఖమ్మం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ లోకాన్ని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా జేఏసీతో చర్చలు జరిపి గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డిఏలను విడుదల చేయాలని , సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు రెగ్యులర్ స్కేల్ ఇవ్వాలని, బీసీ వెల్ఫేర్ పాఠశాల సమయసారణిని మార్చాలని, కేర్ టేకర్స్ ను నియమించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు సద్దాబాబు,మండల అధ్యక్షులు చిన్న రంగారావు, టిపిటిఎఫ్ నాయకులు యాకూబ్ పాషా, ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కన్వీనర్ జల్లా కోటయ్య, మండల కార్యదర్శులు వి రామారావు, కే సురేష్, ఏ నాగేందర్, యు గంగాభవాని, బి. నిర్మల, అరుణ కుమారి, రేఖం శీను, కృష్ణ ప్రసాద్, శ్రీరామారావు, జి శ్రీనివాసరావు, యోహన్, పద్మావతి సుధా, కీర్తి, వసంత రాణి, ఉప శ్రీ, విజయలక్ష్మి, శ్రీ లక్ష్మి వెంకటలక్ష్మి, ఎల్ శ్రీనివాసరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు



# రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

**గుండాల, ఆగస్టు 20,(డిడి9 వార్త).**

గుండాల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఊకే బుచ్చయ్య ఆధ్వర్యంలో స్వర్గీయ భారతరత్న మాజీ ప్రధానమంత్రి శ్రీ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్కే ఖదీర్ హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్కే ఖదీర్ మాట్లాడుతూ.. దేశం కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలు, సేవలు దేశ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు తీసుకెళ్లడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కంప్యూటర్, సమాచార సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన తీసుకున్న నిర్ణయాలు నేడు దేశ ప్రగతికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. యువత రాజకీయాల్లో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఓటు హక్కు వయోపరిమితిని 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని గుర్తు చేశారు. అలాగే స్థానిక సంస్థల్లో మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు రిజర్వేషన్లకు మార్గం సుగమం చేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని, దేశ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎస్కే అబ్దుల్ నభి, వాంకుడోత్ రమేష్, ఎస్కే కాసీం, ఎస్కే వాజీద్ పాషా, నూనావత్ రవి, సనప రాంబాబు, పల్లపు రాజేష్, బొంగు చంద్రశేఖర్, బానోత్ నరేందర్, గడ్డం రాజేష్, జాటోత్ వీరన్న, సోషల్ మీడియా నాయకులు మండలోజు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ ఆశయాలకు అక్షర రూపం.. 'సంఘం శరణం గచ్చామి'





- కళారూపాలతో సామాజిక మార్పుకు శ్రీకారం
- సమాజ మార్పునకు కళే ఆయుధం --
- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**భద్రాచలం , ఆగస్టు 20 (డిడి9 వార్త)**

సామాజిక అసమానతలు, వివక్ష, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కల్పించడంలో కళారూపాలు కీలక పాత్ర పోషిస్తాయని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో భద్రాచలంలో నిర్వహిస్తున్న సామాజిక చైతన్య నాటకోత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, సర్పంచ్ పూణేం కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలిరోజు ప్రదర్శించిన "సంఘం శరణం గచ్చామి" అంబేద్కర్ నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం, విద్యకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యత, అణగారిన వర్గాల హక్కుల కోసం చేసిన పోరాటం, సమానత్వ సాధనకు కృషిని కళాకారులు హృద్యంగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయుల జీవితాలు, పోరాటాలు, ఆశయాలను నాటకాల రూపంలో నేటితరానికి అందించడం అభినందనీయమన్నారు. సినీ దర్శకుడు తాండ్ర రమణ మాట్లాడుతూ స్టేజి నాటికలు ప్రజలపై బలమైన ప్రభావం చూపుతాయని, కళాకారులు సామాజిక సమస్యలపై చైతన్యం కల్పించే బాధ్యతను తీసుకోవాలని అన్నారు. నాటకోత్సవాల్లో భాగంగా శుక్రవారం జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవితాలు, సామాజిక పోరాటాలను ప్రతిబింబించే "సత్యశోధన" నాటికను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ అకాడమీ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబ సత్రం భూములు దళితులకు అప్పగించాలి

## అంబ సత్రం భూములపై సమగ్ర విచారణ చేపట్టాలి

**భద్రాచలం, ఆగస్టు 20 ( డిడి9 వార్త )**



జిల్లాలోని లక్ష్మీదేవి పల్లి మండలంలో ఉన్న అనిశెట్టిపల్లి గ్రామంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి చెందిన అంబ సత్రం భూములను ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దళితులకు తిరిగి అప్పగించాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుమల్ల సుందర్రావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ అంబ సత్రం భూములను కొందరు అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు దళితులను బెదిరించి స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. అనంతరం సంబంధిత అధికారులతో కుమ్మక్కై భూముల రికార్డులను మార్చారని ఆరోపించారు. అంబ సత్రం భూముల క్రయవిక్రయాలకు అవకాశం లేదనే విషయాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. భూములపై క్షేత్రస్థాయి పరిశీలన, సమగ్ర సర్వే చేపట్టి అర్హులైన దళితుల పేర్లను రికార్డుల్లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్ర, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్లను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. దళితులకు న్యాయం చేయకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడతామని వాసుమల్ల సుందర్రావు స్పష్టం చేశారు.

# ప్రజలు తమ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని

## దోమల నివారణకు పాగింగ్ చేపట్టిన సర్పంచ్ మందా కరుణ

**బోనకల్,ఆగస్టు 20, డీడీ9 వార్త:**



గ్రామంలో దోమల బెడదను నివారించేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో పాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ సర్పంచ్ మందా కరుణ ఆధ్వర్యంలో సిబ్బంది పలు వీధుల్లో పాగింగ్ నిర వ్యహించారు. వర్షాకాలంలో దోమల వృద్ధి అధికమయ్యే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా పాగింగ్ చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధులు, నివాస ప్రాంతాల్లో దోమల నివారణకు పొగను పిచికారీ చేశారు.గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ప్రజలు తమ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సర్పంచ్ మందా కరుణ సూచించారు.దోమల నివారణకు పంచాయతీ తరఫున అవసరమైన చర్యలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు - వ్యక్తి మృతి





**భద్రాచలం , ఆగస్టు 20 (డిడి9 వార్త)**

భద్రాచలంలో గోదావరి బ్రిడ్జిపై శుక్రవారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సును వేగంగా వచ్చి కారు ఢీకొట్టడంతో కారులో ఉన్న హరీష్ అనే వ్యక్తి మృతి చెందాడు. అన్నపురెడ్డిపల్లి గ్రామంకు చెందిన హరీష్ భద్రాచలంకు కారులో సాయికిరణ్ అనే వ్యక్తితో కలిసి వస్తున్నారు. ఈక్రమంలో బ్రిడ్జిపైకి వచ్చిన సమయంలో వేగంగా వస్తూ భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ సూపర్ డీలక్స్ బస్సును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న హరీష్ మృతి చెందగా సాయికిరణ్‌కు గాయాలయ్యాయి. దీంతో సంఘటన స్థలాన్ని పరిశీలించిన భద్రాచలం ఎస్సై రామకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. హరీష్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# తోషం తాండాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**డిడి9 వార్త గుడిహత్నూర్:**

మండలంలోని తోషం తాండాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ జాదవ్ జితేందర్ మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డులతో రేషన్ సేవలు మరింత సులభతరం, పారదర్శకంగా అందుతాయని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిపిఓ మహేష్ ఉప సర్పంచ్ మెస్రం రాము, వార్డు సభ్యులు మెస్రం సుకుమార్, చాహన్ నిరంజన్ పాల్గొన్నారు

## జనసేన తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మూల హరీష్ గౌడ్

**హైదరాబాద్,ఆగస్ట్ 20,(డిడి9 వార్త):**



జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మూల హరీష్ గౌడ్ నియమితులయ్యారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి హరీష్ గౌడ్ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్.కే. సాగర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాధారం రాజలింగం కు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి ఇంత కీలకమైన బాధ్యతను అప్పగించడం పట్ల హరీష్ గౌడ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు, జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, పార్టీ కార్యక్రమాలు మరియు ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికార ప్రతినిధిగా తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని అన్నారు .

## డిజిటల్ క్రాప్ సర్వేకు వాలంటీర్లే కీలకం

**డిడి9 వార్త గుడిహత్నూర్ :**



రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు స కాల ంలో అందించడంతో పాటు పంటల వివరాలను పారదర్శకంగా నమోదు చేయడమే లక్ష్యంగా చేపడుతున్న డిజిటల్ క్రాప్ సర్వేపై సీతంగొంది గ్రామంలో వాలంటీర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి భగత్ రమేష్ కుమార్ మాట్లాడుతూ.. డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా రైతుల పంటల వివరాలు ఖచ్చితంగా నమోదు చేస్తే పంట నష్టపరిహారం, బీమా, సబ్సిడీలు తదితర ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. ప్రతి వాలంటీర్ బాధ్యతాయుతంగా వ్యవహరించి గ్రామంలోని ప్రతి రైతు పంట వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. క్లస్టర్ ఏఈఓలు రమణ, వెంకటి, దీపక్, సాయిరాం, శ్రుతి వాలంటీర్లకు మొబైల్ యాప్ వినియోగం, పంటల నమోదు విధానం, భూముల వివరాల సేకరణపై శిక్షణ అందించారు. మండలంలోని ప్రతి రెవెన్యూ గ్రామం నుంచి ఎంపికైన వాలంటీర్లు కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయుధాల వినియోగంలో నైపుణ్యం తప్పనిసరి

### పోలీసులకు ఫైరింగ్ ప్రాక్టీస్: సీపీ సాయిచైతన్య

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**



అత్యవసర పరిస్థితులు, శాంతిభద్రతల పరిరక్షణ సమయంలో నేరస్థులపై తక్షణ చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రతి పోలీసు సిబ్బందికి ఆయుధ సాధన ఎంతో అవసరమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య తెలిపారు. ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జానకంపేట్ వద్ద గల ఫైరింగ్ కేంద్రంలో గురువారం జిల్లా పోలీసు సిబ్బందికి నిర్వహించిన ఫైరింగ్ ప్రాక్టీస్ కార్యక్రమాన్ని ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విధుల్లో ఉపయోగించే ఆయుధాలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని, వాటిని సమర్థవంతంగా, సురక్షితంగా వినియోగించేందుకే ఈ ప్రాక్టికల్ శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. నిర్ణీత లక్ష్యాలపై ఫైరింగ్ చేస్తూ ఖచ్చితత్వం, ఏకాగ్రత, లక్ష్యసాధన నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆయుధాలను ఉపయోగించే సమయంలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ తీవ్ర క్రమశిక్షణతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, టాస్క్‌ఫోర్స్, సీటీసీ, ట్రాఫిక్, ఏఆర్, హోంగార్డ్స్, ఐటీ విభాగాల ఏసీపీలు, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, పీఎస్‌ఓలు పాల్గొన్నారు.

## సీఎం విదేశీ పర్యటన అజెండా వెల్లడించాలి

### ఎంపీ అర్వింద్ ధర్మపురి డిమాండ్

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి డిమాండ్ చేశారు. ఆక్స్‌ఫర్డ్‌లోని 'బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్' సందర్శనపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని, సీఎం అక్కడ ఎవరిని కలుస్తారు, ఏ అంశాలపై చర్చిస్తారో స్పష్టం చేయాలని కోరారు. భారత ప్రభుత్వం, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ప్రచారం జరిగే వేదికలను సీఎం సందర్శించడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వెల్లడించాలని, ఇది కేవలం రాష్ట్రానికి సంబంధించిన అంశం మాత్రమే కాదని, జాతీయ భద్రత, సార్వభౌమత్వంతో ముడిపడి ఉన్న విషయమని పేర్కొన్నారు. కేంబ్రిడ్జ్, హార్వర్డ్, ఎంఐటీ వంటి విదేశీ సంస్థలతో జరిపే సమావేశాల ద్వారా రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలను స్పష్టం చేయాలన్నారు. రాజకీయ నాయకులపై ఉన్న క్రిమినల్ కేసుల విచారణను సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం వేగవంతం చేయాలని, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా చట్ట ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీలు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, డూప్లికేట్, మరణించిన వారి పేర్లను తొలగించడం సహజ ప్రక్రియ అని స్పష్టం చేశారు. 2029లో తెలంగాణలో బీజేపి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని అర్వింద్ ధీమా వ్యక్తం చేశారు.

## జర్నలిస్ట్ సతీష్ కుటుంబాన్ని కలిసిన తాటి వెంకటేశ్వర్లు

- **తినేటి విందులో పాల్గొని కుటుంబ సభ్యులతో సరదాగా ముచ్చటించిన మాజీ ఎమ్మెల్యే**
- **శ్రీ కోదండ రామాలయ నిర్మాణానికి సహాయం అందిస్తానని హామీ**

**అశ్వరావుపేట:ఆగస్టు 20(డిడి 9 వార్త)**




అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామానికి చెందిన గడ్డం పుల్లారావు–లక్ష్మీకాంతం దంపతుల తనయుడు, జర్నలిస్ట్ గడ్డం సతీష్ స్వగృహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, బూర్గంపహాడ్–అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు విచ్చేశారు. ఈ సందర్భంగా సతీష్ కుటుంబ సభ్యులు తాటి వెంకటేశ్వర్లుకు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన తినేటి విందులో పాల్గొన్న తాటి వెంకటేశ్వర్లు, సతీష్ కుటుంబ సభ్యులతో కాసేపు సరదాగా ముచ్చటించారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆత్మీయంగా గడిపారు. తాటి వెంకటేశ్వర్లు తమ ఇంటికి రావడం పట్ల సతీష్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో సాగింది. అనంతరం తోగ్గూడెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ కోదండ రామాలయం కమిటీ సభ్యులు తాటి వెంకటేశ్వర్లును కలిసి ఆలయ నిర్మాణానికి తక్షణ సహాయం అందించాలని కోరారు. దీనిపై తాటి వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందిస్తూ, తమ వంతు సహాయం తప్పకుండా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జుజ్జూరి వెంకన్నబాబు, సున్నం రామలక్ష్మయ్య, పానుగంటి లక్ష్మణ్‌రావు, మాడి ముత్యాలరావు, మడకం ముత్యాలరావు, చెన్నారావు, కొనకళ్ల శ్రీనివాస్, కక్కిరాల లక్ష్మీనారాయణ, జుజ్జూరి సాయి, పానుగంటి చెన్నకేశవులు, కుర్సం వీరరాజు, గొల్లపల్లి మహేష్, నాగుల సాయి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## గిన్నిస్ బుక్ లో స్థానం దక్కించుకున్న చిన్నారి లేక్ష్యశ్రీ

**చర్ల, ఆగష్టు 20 (డిడి 9 వార్త )**






రాష్ట్ర రాజధాని హైదరాబాదు లోని గచ్చిబౌలిలో గత ఏప్రిల్ 26 న ప్రపంచ స్థాయిలో నిర్వహించిన కరాటే విభాగంలో విశేష ప్రతిభ కనబరిచి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్(Guinness World Records)లో స్థానం సంపాదించిన రాహుల్ విజ్ఞాన్ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న చిన్నారి నంబూరి లేక్ష్యశ్రీ, ఈ గొప్ప విజయ సాధనలో అనుక్షణం సరైన శిక్షణ నిచ్చిన కరాటే మాస్టర్ యు.ముత్తు లను ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ డి.ఎన్. కుమార్, డాక్టర్ ప్రతిభ, ఎడ్యుకేషనల్ డైరెక్టర్ శాస్త్రి లేక్ష్యశ్రీ, కరాటే మాస్టర్ యు.ముత్తు లను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్మ రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి పరిటాల వెంకటరమణ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (Guinness World Records)లో స్థానం సంపాదించిన నంబూరి లేక్ష్యశ్రీ ని ఆమె తల్లి దండ్రులను ఇంతటి ఘనమైన విజయాన్ని సాధించ డానికి కారకులైన కరాటే మాస్టర్ యు. ముత్తు దంపతులను పాఠశాల అధ్యాపక బృందంతో కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థిని సాధించిన ఈ ఘన విజయం పాఠశాలకే కాకుండా ప్రాంతానికి ఎంతో గర్వకారణమని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్సలలో కూడా రాణించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తల్లిదండ్రులకు, కరాటే మాస్టర్ ముత్తు కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. వర్మ రాజు, వైస్ ప్రిన్సిపల్ ఎం.వి.ఎల్ నరసింహారావు, కొసరాజు హరిచరణ్, సీనియర్ ఉపాధ్యాయులు ఎస్.కె ఉస్మాన్, క్రాంతి కుమార్, ఆనంద్, సునీత, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా ఘనంగా సద్భావనా దివస్ వేడుకలు

**కూకట్‌పల్లి,ఆగస్ట్ 19,(డిడి9 వార్త):**



భారతరత్న, స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి శ్రీ రాజీవ్ గాంధీ 82వ జయంతిని పురస్కరించుకుని సద్భావనా దివస్ వేడుకలను కూకట్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. 249వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ కవేటి నాగార్జున ఆధ్వర్యంలో కూకట్‌పల్లి వార్డు కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, కూకట్‌పల్లి పరిధిలోని 1,000 మందికి పైగా పాఠశాల విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కవేటి నాగార్జున మాట్లాడుతూ, దేశంలో ఐక్యత, శాంతి, సోదరభావం, సామరస్యాన్ని పెంపొందించడమే సద్భావనా దివస్ ప్రధాన స్ఫూర్తి అని అన్నారు. ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చూపిన దూరదృష్టి, యువతకు ప్రాధాన్యత, సాంకేతిక రంగ అభివృద్ధికి చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. "ప్రజల మధ్య ప్రేమ, ఐక్యత, సోదరభావం బలపడినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుంది" అనే సందేశంతో 249వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని కవేటి నాగార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కుల జేశ్వంత్ రావు (దేశాల్ అన్న), బి. జ్యోతి, బి. గోవింద్ గౌడ్, కృష్ణవేణి, అనిల్, వంశీ, మేకల మహేష్ బాబు, వినయ్ గౌడ్, దీపక్, యశ్వంత్ గౌడ్, కొండల్, శాంతి, లక్ష్మి , ప్రత్యూష తదితర 249వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ నాగార్జున ధన్యవాదాలు తెలిపారు.

## ఇచ్చోడా ఇస్లాంపుర లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం





- **తనిఖీలలో 110 ద్విచక్ర వాహనాలు, 1 ఆటో, 4 కార్లు, స్వాధీనం**
- **150 మంది పోలీసు సిబ్బందితో తెల్లవారుజామున విస్తృత తనిఖీలు**
- **నంబర్ ప్లేట్ లేని, ఫేక్ నంబర్ ప్లేట్ కలిగిన 15 బైక్స్ స్వాధీనం**
- **గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, మట్కా లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై హెచ్చరిక**
- **ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి, హెల్మెట్ ధరించాలి**
- **ఉట్నూర్ ఏఎస్పీ రూత్విక్ సాయి కొట్టే ఐపీఎస్**

**ఆదిలాబాద్ జిల్లా న్యూస్ బ్యూరో : (డిడి9 వార్త న్యూస్ )**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం, నేరాల నియంత్రణ, ప్రజలతో పోలీసుల అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా గురువారం ఇచ్చోడ మండలంలోని ఇస్లాంపుర గ్రామం లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని తెల్లవారు జామున నుండి నిర్వహించినట్లు ఉట్నూర్ ఏఎస్పి రుత్వీక్ సాయి కొట్టే ఐపీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 5 గంటల నుంచే సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 110 ద్విచక్ర వాహనాలు, 1 ఆటో, 4 కార్, స్వాధీనం చేసుకున్నారు. ఫేక్ నెంబర్ ప్లేట్లు అమర్చిన 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఆసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ముఖ్యంగా గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, గంజాయి సేవించడం, నిల్వ ఉంచడం, రవాణా చేయడం, సరఫరా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ రాయితీ (PDS) బియ్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, విక్రయించడం లేదా అక్రమంగా తరలించడం నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యత తెలియజేస్తూ కాలనీ మొత్తం కలిసికట్టుగా సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని తెలిపారు, నిబంధనలు ఉల్లంఘించిన కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి కమతం ఇంద్ర వర్ధన్, సిఐలు సిహెచ్ రమేష్, కె నరేష్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి. మురళి, ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు, రిజర్వ్ సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు బోధన్ లో ప్రైవేట్ విద్యాసంస్థల బంద్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**

నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డిని పదో తరగతి చదువుతున్న విద్యార్థులే దారుణంగా హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని, కలకలాన్ని రేపింది. విద్యను నేర్పించి భవిష్యత్తుకు బాటలు వేసే గురువుపైనే స్వల్ప విషయాలకే కక్ష పెంచుకుని హత్యకు ఒడిగట్టడం సమాజంలో క్షీణిస్తున్న మానవీయ విలువలకు, ఉపాధ్యాయులకు భద్రత లేని పరిస్థితికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ ఘోర ఉదంతాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఉపాధ్యాయుల భద్రతకు చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ బోధన్‌లోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో గురువారం ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూపారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి అశ్రునివాళులు అర్పించిన యాజమాన్యాలు, ఈ దారుణానికి నిరసనగా నేడు బోధన్ డివిజన్ వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. బోధన్ సమావేశంలో ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఎదురవుతున్న తీవ్ర సవాళ్లు, విద్యార్థుల క్రమశిక్షణా రాహిత్యంపై విస్తృతంగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వాడకం విపరీతంగా పెరిగిపోవడం, సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల విద్యార్థులు చిన్న వయసులోనే దారితప్పి నేర స్వభావాన్ని పెంపొందించుకుంటున్నారని విద్యాసంస్థల ప్రతినిధులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులను ఉపాధ్యాయులు క్రమశిక్షణలో ఉంచేందుకు స్వల్పంగా మందలిస్తే, వాస్తవాలు తెలుసుకోకుండా కొందరు



తల్లిదండ్రులు పాఠశాలలకు వచ్చి గొడవలకు దిగుతున్నారని, దీనివల్ల పిల్లల్లో తప్పుడు ధైర్యం పెరిగి ఉపాధ్యాయుల మాట వినని పరిస్థితి దాపురిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మార్కుల సాధనే ధ్యేయంగా కాకుండా విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాలలతో పాటు తల్లిదండ్రులు, సమాజం కలిసికట్టుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. బస్టాండ్లు, బహిరంగ ప్రదేశాల్లో విద్యార్థులు తప్పుదోవ పడుతుంటే మీడియా ప్రతినిధులు, ప్రజలు స్పందించి పాఠశాల యాజమాన్యాలకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మహాలక్ష్మి కళ్యాణ మండపం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి వినతి పత్రం సమర్పించనున్నట్లు ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ విద్య సంస్థల యాజమాన్యాలు పాల్గొన్నారు.

# ప్రమాద రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యత





- **బోధన్ ఏసీపీ పి.శ్రీనివాస్**
- **ఆపదలో ఆదుకునే ఆర్థిక వెన్నుదన్ను ఇన్సూరెన్స్ : డీజీఎం సురేష్**
- **బోధన్‌లో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ఉచిత హెల్మెట్ల పంపిణీ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**

వాహనదారులు కేవలం పోలీసుల జరిమానాలు, చలానాల నుంచి తప్పించుకోవడానికి మాత్రమే కాకుండా తమ సొంత ప్రాణ రక్షణ మరియు కుటుంబ శ్రేయస్సు కోసమే హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని పోలీసు అధికారులు, బీమా రంగ నిపుణులు పిలుపునిచ్చారు. బోధన్ పట్టణం టీటీడీ కల్యాణ మండపంలో గురువారం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బోధన్ శాఖ ఆధ్వర్యంలో 'రోడ్డు భద్రత – లైఫ్ ఇన్సూరెన్స్ అవగాహన కార్యక్రమం' నిర్వహించారు. ఈ సదస్సుకు బోధన్ ఏసీపీ పి.శ్రీనివాస్, నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ, బోధన్ ఎస్‌హెచ్ఓ వెంకట్ నారాయణ, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సేల్స్ డీజీఎం సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తూ, పలువురు ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రతి వాహనదారుడు తమ కోసం ఇంట్లో కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. పోలీసుల జరిమానాల భయంతో కాకుండా స్వచ్ఛందంగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం అలవాటు చేసుకోవాలన్నారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి ప్రమాదానికి గురైతే ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల బారిన పడి కుటుంబాలు చితికిపోకుండా ఉండేందుకు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూనే, ప్రతి ఒక్కరూ తమ వార్షిక ఆదాయానికి తగినంత లైఫ్ ఇన్సూరెన్స్ కవరేజ్ తీసుకోవడం అత్యంత ఆవశ్యకమని ఆయన స్పష్టం చేశారు. నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ మాట్లాడుత... ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించకపోవడం వల్ల చిన్న ప్రమాదాలు కూడా తీవ్రమైన తలగాయాలకు, ప్రాణనష్టానికి దారితీస్తున్నాయని తెలిపారు. కార్లలో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ ధరిస్తేనే ప్రమాద సమయంలో ఎయిర్‌బ్యాగ్‌లు సరిగ్గా తెరుచుకుని ప్రాణాలను కాపాడుతాయని వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపినా లేదా మద్యం సేవించి ప్రమాదానికి గురైనా ఇన్సూరెన్స్ కంపెనీలు క్లెయిమ్‌ను పూర్తిగా తిరస్కరిస్తాయని హెచ్చరించారు. దీనివల్ల ప్రమాద బాధితులకు ఎలాంటి ఆర్థిక పరిహారం అందక కుటుంబాలు రోడ్డున పడతాయని, వాహనం నడుపుతున్నప్పుడు సెల్ ఫోన్ మాట్లాడటం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. బోధన్ ఎస్‌హెచ్ఓ వెంకట్ నారాయణ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వకూడదని విజ్ఞప్తి చేశారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే తల్లిదండ్రులపైనే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు థర్డ్ పార్టీ మరియు కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ పాలసీలు చెల్లుబాటులో ఉన్నాయో లేదో తరచూ తనిఖీ చేసుకోవాలని, సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే ప్రమాద రహిత సమాజం సాధ్యమవుతుందని చెప్పారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సేల్స్ డీజీఎం సురేష్ మాట్లాడుతూ.. ప్రతి సామాన్య, మధ్యతరగతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రమాదాలు ముందస్తు సమాచారం ఇచ్చి రావు కాబట్టి రోడ్డు భద్రత ఎంత ముఖ్యమో, భవిష్యత్తు ఆర్థిక భద్రత కూడా అంతే ముఖ్యమని తెలిపారు. సామాన్యులకు భారం కాకుండా తక్కువ ప్రీమియంతో ఎక్కువ కవరేజ్ ఇచ్చే పథకాలను అందిస్తున్నామని, అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు క్లెయిమ్‌లను అత్యంత వేగంగా పరిష్కరించి బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. అనంతరం ఇటీవల మరణించిన వ్యక్తులకు సంబంధించిన చెక్కులను నామినీలకు అందజేశారు. ద్విచక్ర వాహనదారులకు అధికారుల చేతుల మీదుగా ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. హెల్మెట్లు ధరించి వాహనదారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ట్రాఫిక్ ఎస్సై మహేష్, శ్రీరామ్ కంపెనీ డిఎం నగేష్ సార్, ఏఎం సౌందర్య, ఎంప్లాయి రాఘశ్రీ, మహేందర్, సురేఖ నర్మదా, సతీష్, శ్రీకాంత్, దివ్య, డెవలప్మెంట్ ఆఫీసర్స్ రవీందర్ యాదవ్, దిలీప్ పటేల్, పద్మాకర్, సింగెడే పాండు, స్వప్న, విజేత, ఏజెంట్లు పాల్గొన్నారు.





# నెలసరి దాచేది కాదు.. అవగాహనతోనే ఆరోగ్యం

- **శక్కర్‌నగర్ పాఠశాలలో ప్రత్యేకావగాహన సదస్సు**
- **హాజరైన సీడీపీఓ నందిని, డీహెచ్‌ఈడబ్ల్యూ సభ్యులు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**

నెలసరి అనేది మహిళల జీవితంలో జరిగే సహజమైన శారీరక ప్రక్రియ మాత్రమేనని, దానిపై ఎవరూ భయపడాల్సిన, సిగ్గుపడాల్సిన అవసరం లేదని బోధన్ సీడీపీఓ నందిని స్పష్టం చేశారు. మహిళా శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత



పాఠశాలలో 'బాలికల నెలసరి ఆరోగ్యం – పరిశుభ్రత'పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీడీపీఓ నందిని మాట్లాడుతూ.. నెలసరి సమయాల్లో ఎదురయ్యే సమస్యలను బాలికలు సంకోచించకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు. సకాలంలో ప్యాడ్‌లు మార్చడం, చేతులు శుభ్రం చేసుకోవడం, పోషకాహారం తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని వివరించారు. డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న మాట్లాడుతూ.. నెలసరిపై సమాజంలో ఉన్న అపోహలను పటాపంచలు చేస్తూ బాలికలకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తీవ్రమైన కడుపునొప్పి, అధిక రక్తస్రావం వంటి సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని హెచ్చరించారు. నెలసరి సిగ్గుపడాల్సిన విషయం కాదు.. పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉండాల్సిన సమయం అనే సందేశాన్ని విద్యార్థినులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అన్నగ్రేసి, డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ సౌమ్య, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు పెద్ద ఎత్తున విద్యార్థినులు పాల్గొన్నారు.

## గురువుపై ఘాతుకం హేయం: పీఆర్‌టీయూ

### సెల్‌ఫోన్ వద్దన్నందుకే హత్య కావిస్తారా?: ఎంబెల్లి శంకర్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**



నల్గొండ జిల్లాలోని నాగార్జున గ్రామర్ పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి దారుణ హత్యను పీఆర్‌టీయూ సంఘం పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర బాధ్యులు ఎంబెల్లి శంకర్ తెలిపారు. విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులను శత్రువులుగా చూడటం సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదర్శ సమాజాన్ని నిర్మించే గురు సమూహానికి ఈ దారుణ పరిణామం తీరని మచ్చగా నిలుస్తుందన్నారు. పాఠశాలకు సెల్‌ఫోన్ తీసుకురావద్దని చెప్పినందుకే ప్రిన్సిపాల్‌ను హతమార్చే స్థాయికి విద్యార్థుల వైఖరి దిగజారడం తీవ్రంగా ఆలోచించాల్సిన విషయమన్నారు. పిల్లల ప్రమాదకర మానసిక స్థితిని మార్చేందుకు తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తన పట్ల నిరంతరం జాగ్రత్త వహించాలని, లేకపోతే వారి భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలని, ఈ ఘాతకానికి ఒడిగట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జోగినుల భూములపై విచారణ జరపాలి

### తహసీల్దార్ కు జానకంపేట్ బాధితుల వినతి



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**

గతంలో తమకు ప్రభుత్వం కేటాయించిన భూములను ఒక వ్యక్తి అక్రమంగా తన పేరుపై పట్టా చేయించుకున్నాడని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గురువారం మండల తహసీల్దార్ దత్తాత్రిని కలసి వినతిపత్రం అందజేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. 1993లో అప్పటి ప్రభుత్వం ఎడపల్లి శివారులోని ఎన్ఎస్ఎఫ్ కు చెందిన 10 ఎకరాల భూమిని జానకంపేట్ కు చెందిన 10 జోగిని కుటుంబాలకు కేటాయించింది. 2018 వరకు భూ రికార్డుల్లో తమ పేర్లే ఉండగా ఆ తర్వాత ఓ వ్యక్తి ఆ భూమికి తన పేరుపై పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. ప్రస్తుతం తామే ఆ భూములను సాగు చేసుకుంటూ కబ్జాలో ఉన్నప్పటికీ, సదరు వ్యక్తి తరచూ తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రికార్డులను పరిశీలించి విచారణ జరపాలని, తమ పేర్లపై పట్టాలను పునరుద్ధరించి పాస్‌బుక్కులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సాధా సంజయ్, ఎం.బి. నాగేష్, అనిల్, తాడంచెనా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి 'మేముసైతం' చేయూత

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**



తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న పసికందు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ముధోల్‌కు చెందిన జింకొల్ల జ్యోతి–రమేష్ దంపతుల కుటుంబానికి 'మేముసైతం' స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ బిడ్డను కాపాడుకునేందుకు దాతలు సాయం చేయాలని బాధితులు సోషల్ మీడియా ద్వారా అభ్యర్థించారు. ఈ దయనీయ ఉదంతంపై 'మేముసైతం' ఎన్జీఓ చైర్మన్ డాక్టర్ నవీన్ కుమార్ గైని తక్షణమే స్పందించారు. బిడ్డ అత్యవసర వైద్య ఖర్చుల కోసం సంస్థ తరఫున రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఈ దంపతులకు జన్మించిన ఇద్దరు కుమారులు పురిటిలోనే మరణించారని, ఇప్పుడు పుట్టిన మూడో బిడ్డ కూడా తీవ్ర అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. బిడ్డ కోలుకోవడానికి మరింత వైద్య ఖర్చులు అవుతాయని, దాతలు ఉదారంగా ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సన్నల 'బోనస్ 'కు వివరాల నమోదు తప్పనిసరి

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**

ఈ వానకాలం సీజన్‌లో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్నరకం వరి సాగు చేస్తున్న రైతులకు మాత్రమే రూ.500 బోనస్ వర్తిస్తుందని కమ్మర్‌పల్లి మండల వ్యవసాయ అధికారి రమ్యశ్రీ తెలిపారు. డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో డీలర్ వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలని గురువారం ఒక ప్రకటనలో సూచించారు. కౌలు రైతులు సైతం భూ యజమాని పాస్‌బుక్ ఆధారంగా ఆన్‌లైన్ నమోదు చేయించుకోవచ్చని చెప్పారు. డీలర్ల వద్ద కాకుండా సొంత విత్తనాలు వినియోగించినా, పరిశోధన స్థానాల నుంచి కొనుగోలు చేసినా స్వయం ప్రకటిత ఫారం పూర్తి చేసి రైతువేదికలోని ఏఈఓలకు అందజేయాలన్నారు. మరోవైపు ఎరువుల కొనుగోలుకు వినియోగించే 'సెంట్రల్ యాప్'ను అప్‌డేట్ చేశామని, ఇకపై మండల పరిధిలోని దుకాణాలే అందులో కనిపిస్తాయని, రైతులు వెంటనే తమ యాప్‌ను అప్‌డేట్ చేసుకోవాలని కోరారు.

## సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ బాటలు

**మాజీ ప్రధాని జయంతి వేడుకల్లో ముత్యాల సునీల్ కుమార్**



**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని ఆధునిక సాంకేతికత, ఐటీ రంగాలు మరియు సాంకేతిక విప్లవం వైపు నడిపించడంలో రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన దూరదృష్టి గల సంస్కరణలు మైలురాయిగా నిలిచాయని కొనియాడారు. ప్రభుత్వ, బ్యాంకింగ్, పారిశ్రామిక రంగాలలో కంప్యూటర్ల వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా నేటి బలీయమైన ఐటీ రంగానికి రాజీవ్ గాంధీ ఆనాడే బలమైన పునాది వేశారని సునీల్ కుమార్ తెలిపారు. సీ–డాట్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ద్వారా స్వదేశీ టెలికాం సాంకేతికతను అభివృద్ధి చేసి దేశవ్యాప్తంగా టెలిఫోన్ సేవలను విస్తరించారని గుర్తుచేశారు. గ్రామ స్వరాజ్య సాధనకు, స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదా కల్పించేందుకు ఆయన తెచ్చిన బిల్లులే తదనంతరం పంచాయతీరాజ్ చట్ట రూపకల్పనకు మార్గం సుగమం చేశాయని పేర్కొన్నారు. పరిశ్రమలపై ఉన్న అదనపు నియంత్రణలను సడలించి ఆర్థిక సరళీకరణ చర్యలకు నాంది పలికారని రాజీవ్ గాంధీ దార్శనిక నిర్ణయాలే నేటి డిజిటల్ భారత్‌కు మూలస్తంభాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## యువతకు రాజీవ్ గాంధీ ఆదర్శప్రాయుడు



**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**

మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ నేటి యువతకు ఆదర్శప్రాయుడని పిప్రి గ్రామ సర్పంచ్ అరిగెల జనార్ధన్ పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. దేశంలో యువతకు ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. రాజకీయాల్లోకి రావాలనే ఉద్దేశం లేకపోయినా, తల్లి ఇందిరాగాంధీ అకాల మరణం తర్వాత దేశ సేవ కోసమే రాజకీయ ప్రవేశం చేశారని గుర్తుచేశారు. ప్రధానిగా దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసి, ఆధునిక భారత నిర్మాణానికి విశేష కృషి చేశారని కొనియాడారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్తూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు రాజేష్, ఉపసర్పంచ్ రంజిత్, జేమ్స్, వీడీసీ సభ్యులు గంగారం, అశోక్, స్వామి, నర్సింగ్, ప్రతాప్, లింబన్న గొల్ల, రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ స్థలాల్లో నీటి సంరక్షణ కుంటలు నిర్మించాలి




**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**

భూగర్భ జలమట్టాలను పెంపొందించుకోవడానికి కమ్యూనిటీ స్థలాలలో నీటి సంరక్షణ కుంటలను విస్తృతంగా నిర్మించాలని భీంగల్ ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ తెలిపారు. 'జలసిరి' కార్యక్రమంలో భాగంగా భీంగల్ మండలం బాబాపూర్ – కుప్కాల్ అటవీ ప్రాంతంలో చేపడుతున్న నీటి సంరక్షణ కుంట తవ్వకం పనులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేయడానికి ఈ నీటి సంరక్షణ కుంటలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఈ పనులను చేపట్టడం వల్ల గ్రామీణ కూలీలకు స్థానికంగానే జీవనోపాధి లభిస్తుందని వివరించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమీర్, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- **మల్లారం గండి వద్ద 'వనమహోత్సవం'**
- **మొక్కలు నాటిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. నగర సమీపంలోని మల్లారం గండి వద్ద గురువారం నిర్వహించిన 'వనమహోత్సవం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు మనం నాటే ప్రతి మొక్క భావితరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని భవిష్యత్తుకు బలమైన బాటలు వేస్తుందన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుకునేందుకు, సమాజంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకొచ్చి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఉమారాణి,



డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమించిన ఆసుపత్రులపై వేటు

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త)**

నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్న పలు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి.రాజశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ నగరంలోని బోధన్ రోడ్డు, అహ్మద్‌పురా కాలనీల్లోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో బుధ, గురువారాల్లో ఆమె ఆకస్మిక తనిఖీలు చేపట్టి, తీవ్రమైన లోపాలను గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బోధన్ రోడ్డులోని పి.టి.ఎస్. స్కానింగ్ సెంటర్‌లో ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా లేకపోవడం, ఓపి రిజిస్టరుతో పాటు 'ఫామ్–ఎఫ్' రికార్డులు అసంపూర్తిగా ఉండటం, అర్హత లేని వ్యక్తుల ద్వారా రిఫరల్స్ రాయించడం లాంటి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ఉల్లంఘనలను గుర్తించి నోటీసులు




ఇచ్చారు. అహ్మద్‌పురా కాలనీలోని ఒక క్లినిక్‌లో యునానీ వైద్యుడు అలోపతి చికిత్స అందిస్తుండటం, అలోపతి మందులు లభించడంతో పాటు చిన్నపిల్లల, స్త్రీ వైద్య నిపుణులు ఉన్నట్లు తప్పుడు బోర్డులు ప్రదర్శిస్తుండటంతో వెంటనే ఆ బోర్డులను తొలగించి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. బోధన్ రోడ్డులోని 50 పడకల 'హయత్ ఆసుపత్రి'లో నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. పార్కింగ్, ర్యాంపు సదుపాయాలు లేకపోవడం, బయోమెడికల్ వేస్ట్ సేకరించకపోవడమే కాకుండా డాక్టర్ కావ్య ప్రత్యక్షంగా అందుబాటులో లేకపోయినా డిజిటల్ సంతకాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించారు. ఎంటీపీ రిజిస్ట్రేషన్ లేకుండానే మే 2025 నుంచి ఇప్పటివరకు నిబంధనలకు విరుద్ధంగా 51 ఆపరేషన్లు చేసినట్లు తేలింది. ఆపరేషన్ థియేటర్‌లో కాలంచెల్లిన మందులు లభించడం, గత ఐదేళ్లుగా పీసీపీఎన్‌డీటీ డేటా నిర్వహించకపోవడం, అనుమతి లేకపోయినా చిన్నపిల్లల వైద్య సేవలు అందించడం వంటి తీవ్ర నిబంధనావళి ఉల్లంఘనలపై డీఎంహెచ్‌ఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీల్లో డీఎంహెచ్‌ఓతో పాటు ఏఓ సుమంత్ కుమార్, వైద్యులు సుప్రియ, రామకృష్ణ, కీర్తన, వేణుగోపాల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- **బిడీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజయ్ డిమాండ్**
- **బోధన్ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**

రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అందాల్సిన సుమారు రూ.10,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సంజయ్ తల్లారే డిమాండ్ చేశారు. బోధన్ పట్టణంలోని పీఆర్‌టీయూ భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో బిడీఎస్ఎఫ్ బోధన్ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుని ప్రకటించారు. ఈ సందర్భంగా సంజయ్ తల్లారే మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, భగత్ సింగ్‌ల ఆశయ సాధనతో పాటు విద్యార్థి రంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బిడీఎస్ఎఫ్ పోరాడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు వెంటనే కల్పించాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరించే దిశగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబరు 97ను రద్దు చేయాలని, శక్తి పాలసీని ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు. ఎస్బీటీఈటీ బోర్డును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్కిల్ యూనివర్సిటీ పేరుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా పాలిటెక్నిక్ కోర్సులను ఇంజినీరింగ్




స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని, లేనిపక్షంలో భవిష్యత్తు పోరాటాలకు సంసిద్ధమవుతామని హెచ్చరించారు. బోధన్ డివిజన్ బిడీఎస్ఎఫ్ నూతన కమిటీకి 13 మంది ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా మహేష్, కార్యదర్శిగా శ్రీకిరణ్, ఉపాధ్యక్షులుగా రాహుల్, మోహన్, సహాయ కార్యదర్శులుగా సాయిచరణ్, లాజర్, కోశాధికారిగా కృష్ణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు కాంబ్లే లాలు, జిల్లా సోషల్ మీడియా ఇన్‌ఛార్జి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడపల్లి సొసైటీ ఎరువుల నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

**ఆర్డీవోకు అఖిలభారత ఐక్య రైతు సంఘం వినతి**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**

ఎడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎరువుల విక్రయాల సొమ్ము దుర్వినియోగానికి పాల్పడిన వారిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బోధన్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్మల గంగాధర్, పుట్టి నడిపి




నాగన్న, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పార్వతి రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఎడపల్లి సొసైటీలో రైతులకు ఎరువులు విక్రయించిన రూ.28 లక్షల నుంచి రూ.30 లక్షల సొమ్మును ముగ్గురు సేల్స్‌మెన్లు సొసైటీ ఖాతాలో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నారని ఆరోపించారు. ఒకవైపు ఎరువులు దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, అమ్మిన డబ్బులను దుర్వినియోగం చేయడం విచారకరమన్నారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకుని, విధి నిర్వహణ నుంచి తప్పించాలని కోరారు. డివిజన్ పరిధిలోని అన్ని సొసైటీల పనితీరుపై ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 13తో రైతు బీమా గడువు ముగిసిన నేపథ్యంలో, ఈ పథకాన్ని యథావిధిగా కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన బడ్జెట్ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన రైతు కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ఎప్పటిలాగే అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్ నాయకులు కాశ రవి, సుల్తాన్ సాయిలు, సిద్ధ పోశెట్టి, శ్రీపతి మల్లేష్, సుదర్శన్, హనుమాన్లు, కొండ్ర లక్ష్మణ్, ఎల్.గంగాధర్, మన్యం పోశెట్టి, గుండ్ల పెద్దలు, ఎర్రన్న, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 20(డిడి9 వార్త):**

భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను వారు స్మరించు



కున్నారు. దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు నడిపించడంలో, యువతకు కొత్త అవకాశాలు కల్పించడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.దేశాభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి, ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని గడ్డం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు గడ్డమీది మహేష్, కామారెడ్డి నియోజకవర్గ అధ్యక్షులు మెహర్ బాబా గౌడ్, టౌన్ అధ్యక్షులు సుదర్శన్, డీసీసీ ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్, డీసీసీ జనరల్ సెక్రటరీ నిమ్మ విజయకుమార్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు పంపరి శ్రీనివాస్, చాట్ల వంశీ, జమీల్, రంగరమేష్ గౌడ్, సాయి బాబు, సేవాదళ్ జిల్లా యూత్ అధ్యక్షుడు నర్సల్లా మహేష్, ఆబిద్, నిరంజన్, ఇమరోజ్, శశి, రాహుల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆత్మీయుని కుటుంబానికి అండగా జాతి బిడ్డల ఆర్థిక సహాయం

**బాన్సువాడ, ఆగస్టు 20(డిడి9 వార్త):**



మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీయస్) సీనియర్ నాయకులు గరుగల్ల బాలరాజ్ కుటుంబానికి జాతి బిడ్డలు అండగా నిలిచారు. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న ఆధ్వర్యంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు జర్నలిస్టులు, నాయకులు, ఎమ్మార్పీయస్ నాయకులు గురువారం బాలరాజ్ కుటుంబాన్ని పరామర్శించారు.అనంతరం అందరి సహకారంతో రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా కాదేపురం గంగన్న మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మార్పీయస్ ఆధ్వర్యంలో జరిగిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి బాన్సువాడ నియోజకవర్గంలో గరుగల్ల బాలరాజ్ విశేషంగా కృషి చేశారని తెలిపారు.మందకృష్ణ మాదిగకు పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచిన నిగర్వి నాయకుడిగా బాలరాజ్ సేవలు అందించారని, ఆయన చేసిన సేవలను మాదిగ జాతి ఎన్నటికీ మరువదని పేర్కొన్నారు.బాలరాజ్ కుటుంబానికి స్థానిక ఎమ్మార్పీయస్ నాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచిన ఎర్రోళ్ల అశోక్ (మీర్జాపూర్), ముక్కగల్ల ప్రసాద్ (పాత బాన్సువాడ), ఎర్రోళ్ల సాయిలు మహారాజ్ (మీర్జాపూర్), ఎర్రోళ్ల భూమయ్య (కంశేట్‌పల్లి), బోయి సీతయ్య (టీచర్, బరంగ్ఏడ్గి), బోయి చిన్న సాయిలు (బరంగ్ఏడ్గి), కాదేపురం గంగన్న (జర్నలిస్ట్, బరంగ్ఏడ్గి), ఎర్రోళ్ల గంగారాం (టీచర్, గోపన్‌పల్లి), కోటగిరి సతీష్ (జర్నలిస్ట్, లాడేగాం), మావురం సాయిబాబా (గిర్దావర్, దుర్కి), మారుశెట్టి హన్మండ్లు (జర్నలిస్ట్, కిష్టాపూర్), కూనింటి రాము (హాజీపూర్), టేకుర్ల సాయి (నసుర్లాబాద్), రొడ్డ వెంకటి (కంశేట్‌పల్లి), సంతోష్ (ఏఈ, ట్రాన్స్‌కో, నసుర్లాబాద్)లకు కుటుంబ సభ్యుల తరపున గంగన్న పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బాలరాజ్ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని భావించే వారు తమకు తోచిన సహాయం చేసి అండగా నిలవాలని కోరారు. సహాయం చేయదలచిన వారు 9491738933 నంబర్‌కు ఫోన్‌పే లేదా గూగుల్‌పే ద్వారా ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో బాలరాజ్ కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీయస్ నాయకులు, జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోరిక మేరకు ఖరీఫ్ పంటకు నిజాంసాగర్ నీళ్లు





## బాన్సువాడ రైతులకు పోచారం శ్రీనివాసరెడ్డి భరోసా

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 20(డిడి9 వార్త):**

రైతుల విజ్ఞప్తి మేరకు ఖరీఫ్ పంటకు అవసరమైన సాగునీటిని నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన పోచారం శ్రీనివాసరెడ్డి, ప్రాజెక్టులోని ప్రస్తుత నీటి నిల్వ వివరాలను ప్రాజెక్టు డీఈ ప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం ప్రాజెక్టులో 1400.84 అడుగుల నీటిమట్టంతో 12.284 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో ఇప్పటికే వరి నాట్లు వేసుకున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఖరీఫ్ పంట సాగుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పోచారం వెల్లడించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ పంటలను కాపాడుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో సాగుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్న భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బాన్సువాడ నియోజకవర్గ రైతుల పక్షాన పోచారం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే బాన్సువాడ నియోజకవర్గంలోని నాన్-కమాండింగ్ ఏరియాలకు సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న సిద్దాపూర్ రిజర్వాయర్ రివైజ్డ్ శాంక్షన్‌కు అంగీకారం తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ, నిజాంసాగర్ మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- ఉచిత రేషన్ బియ్యంసద్వినియోగం చేసుకోవాలి.
- సర్పంచ్ మేస్త్రం రూప

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం (డిడి9వార్త )**



తలమడుగు మండలంలోని ఝరి గ్రామంలో పునాగుడా. మందగూడ. రత్నాపూర్. ఝరి. గ్రామాలకు సంబంధించిన. లబ్ధిదారులకు. స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు. ఝరి సర్పంచ్ మేస్త్రం రూప తెలిపారు పేద కుటుంబాలకు. ఆహార భద్రత కల్పించాలని ఉద్దేశంతో. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి. ఎనుముల రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు రేషన్ పొందె లబ్ధిదారులు వారి జీవనమనగడ నిమిత్తం ఏ ప్రాంతంలో ఉన్న. ఎక్కడి నుండైనా ఈ యొక్క స్మార్ట్ రేషన్ కార్డు ద్వారా రేషన్ బియ్యం సులభంగా తీసుకోవచ్చు అని అన్నారు డిజిటల్ రేషన్ కార్డు ద్వారా నిజమైన లబ్ధిదారులను గుర్తించే వీలుందన్నారు తొమ్మిది రకాల అధునాతన భద్రత ప్రమాణాలతో ప్రభుత్వం ఈ కార్డును రూపొందించడం జరిగింది అని. మీసం రూప తనదైన శైలిలో ప్రజలకు క్లుప్తంగా వివరించారు. ప్రజా సేవే తన లక్ష్యమని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి. ప్రజల కష్ట సుఖాలలో పాలుపంచుకుంటూ. ఎటువంటి వర్గ విభేదాలకు జాతి విభేదాలకు తావివ్వకుండా ప్రజలంద రూగ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మందగూడ సర్పంచ్ వినాయక్. పునాగుడా సర్పంచ్ హనుమంతు. రత్నాపూర్ సర్పంచ్. ఆత్రం నగేష్ ఉప సర్పంచ్ మడవి లక్ష్మణ్ జిపిఓ ఆత్రం వామన్. పంచాయతీ సెక్రటరీ అశోక్. మేస్రం కాశిరాం రాకేష్ రెడ్డి vra గడుగు సంతోష్ మరియు గ్రామస్తులు. వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# కలెక్టరేట్‌ను పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 20(డిడి9 వార్త):**





జిల్లా కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో ఆహ్లాద కరంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.కలెక్టరేట్‌లోని వివిధ శాఖలకు కేటాయించిన ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలను సంబంధిత శాఖలు చేపట్టాలని ఆదేశించారు.చెత్తాచెదారం పేరుకుపోకుండా నిరంతరం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఊటకుంటను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.కుంట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలో పచ్చదనం పెంపొందించేలా మొక్కలు నాటి, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో భాగంగా డబ్ల్యూడీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మొక్కను నాటారు.మొక్కల సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, క్రమం తప్పకుండా నీరు అందిస్తూ వాటిని పరిరక్షించాలని అధికారులకు సూచించారు.కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రతి శాఖ బాధ్యతగా భావించి పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి, డీఆర్ఓ పాండు, ఏవో మసూద్ హైమద్, శిశు సంక్షేమ అధికారి ప్రసన్న, సీపీఓ మెగ్మా శ్రీధర్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ అధికారి దామోదర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం



**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 20(డీడీ9 వార్త) :**

దేశ ప్రగతికి, సాంకేతిక విప్లవానికి బాటలు వేసిన దార్శనికుడు, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆశయాలు భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కొనియాడారు. రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నగర మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ.. దేశాభివృద్ధి, యువత సాధికారత, సాంకేతిక రంగ విస్తరణతో పాటు స్థానిక సంస్థల బలోపేతానికి రాజీవ్ గాంధీ చూపించిన దూరదృష్టి నవభారత నిర్మాణానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. ఆయన ఆలోచనలు, సంస్కరణలు నేటి తరానికి ఎంతో ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీ విగ్రహానికి అంజలి ఘటించారు.

# ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 20(డిడి9 వార్త):**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు గడుస్తున్నా ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు.విభజన రాజకీయాలను పక్కనపెట్టి దేశంలోని కోట్లాది మంది యువతకు వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల మేనిఫెస్టోలో రెండు లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీని నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను గుర్తించి వెంటనే నియామక ప్రక్రియ చేపట్టాలని కోరారు. ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగ యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొంటోందని చంద్రశేఖర్ అన్నారు.ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దొడ్లే మోహన్‌తో పాటు పలువురు యువకులు పాల్గొన్నారు.

# రూపారెడ్డికి న్యాయం చేయాలి.. క్యాండిల్ ర్యాలీతో నిరసన




**అదిలాబాద్ జిల్లా**

ప్రిన్సిపాల్ రూపారెడ్డి మృతి పట్ల ఇచ్చోడ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిరసన వ్యక్తం చేశాయి. గురువారం స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద క్యాండిల్స్ వెలిగించి ర్యాలీ నిర్వహించి రూపారెడ్డికి నివాళులర్పించారు. ఆమెకు న్యాయం జరగాలని కోరుతూ సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల సంఘం రాష్ట్ర నాయకుడు బద్దం పురుషోత్తం రెడ్డి, ప్రగతి పాఠశాల, ఎస్సార్ స్కూల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సురకంటి వెంకటరెడ్డి, ఇచ్చోడ ప్రైవేట్ పాఠశాలల మండల అధ్యక్షుడు రాథోడ్ అనిల్, సన్‌షైన్ స్కూల్ కరస్పాండెంట్ అరుగుల గణేష్, కృష్ణవేణి పాఠశాల కరస్పాండెంట్ ధర్మన్న, విద్యాలయ పాఠశాల కరస్పాండెంట్ శ్యామ్ రెడ్డి, ఫస్ట్ స్టెప్ పాఠశాల కరస్పాండెంట్ కపిల్ రెడ్డి, సెయింట్స్ పాఠశాల ప్రిన్సిపాల్ షేర్ఇట్ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో ఇచ్చోడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొడప జలైజాకు, వివిధ ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాల్, యాజమాన్య ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని రూపారెడ్డికి నివాళులర్పించారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518